ఉచిత హెల్త్ క్యాంపు



ఇబ్రహీంపట్నంలోని కేశవ్ మెమోరియల్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం వెల్‌నెస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. క్యాంపులో ఆస్పత్రి జనరల్ మేనేజర్ సీతారామారావు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొని ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

మాలమహానాడు యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా శంకర్



శంకర్‌కు నియామక పత్రం అందజేస్తున్న చెన్నయ్య

ఎల్‌బీనగర్: మాలమహానాడు రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా వనస్థలిపురానికి చెందిన చేవూరి శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. మాలల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు మాల మహానాడు పటిష్టతకు పాటుపడతానని శంకర్ అన్నారు.తనకు యువజన విభాగం అధ్యక్ష పదవి ఇచ్చినందుకు చెన్నయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాలుక రాజేష్, గ్రేటర్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు ఆదర్శ మౌర్య, రమేష్, ఎల్ల స్వామి, రాజు పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యలను పరిష్కరిస్తా



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: కాలనీల్లో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం కాలనీలో నెలకొన్న పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి రామచారి, గౌరవ అధ్యక్షుడు వెంకటేష్, సభ్యులు భిక్షపతి, జై సింఘ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో పెట్టాలని వినతి

హస్తినాపురం: ఇంటర్మీడియట్ విద్యార్థులను ఫీజుల పేరుతో వేధిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ విద్య నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు కోరారు. ఇంటర్ పరీక్షకు ఒక రోజు ముందు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో పెట్టడం వల్ల విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని కోరుతూ శనివారం ఆయన ఇంటర్మీడిట్ బోర్డు డైరెక్టర్ శృతిఓజాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బచ్చు రామకృష్ణ, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న బంజారా న్యాయవాద సంఘం సభ్యులు

రంగారెడ్డి కోర్టులు: బంజారా న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ఆవరణలో సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సభావత్ శ్రీనివాస్ నాయక్, అధ్యక్షుడు చిన్నా నాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యాయవాదులు కుల మతాలకు అతీతంగా వృత్తి పరంగా చాలా స్నేహపూర్వకంగా తమ విధులు నిర్వహిస్తారని జిల్లా ప్రాధాన న్యాయమూర్తి కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సంచాలకుడు డాక్టర్ బాచిరెడ్డి శాయి రెడ్డి, జిల్లా న్యయవాద సంఘం అధ్యక్షుడు డీకొండ రవీందర్, కార్యదర్శి పట్లోళ్ల మాధవ రెడ్డి, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

మా న్యాయపోరాటాన్ని ప్రభుత్వం గుర్తించాలి

- ఇండస్ట్రీస్ హౌసింగ్ సొసైటీ కన్వీనర్ మూర్తి

సైదాబాద్: ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ హౌసింగ్ సొసైటీ సభ్యుల న్యాయపోరాటాన్ని ప్రభుత్వం గుర్తించి వెంటనే పరిష్కరించాలని సొసైటీ కన్వీనర్ కేఎస్ఆర్ మూర్తి కోరారు. శనివారం ఐఎస్‌సదన్‌లోని పార్కులో ఏర్పాటు చేసిన సొసైటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1976లో ఏర్పాటైన తమ సొసైటీ 1981లో అప్పటి ప్రభుత్వ నియమాలకు అనుగుణంగా సింగరేణి కాలనీలోని భూమిని కొనుగోలు చేసిందని తెలిపారు. అయితే తమ స్థలంలో కొందరు అక్రమంగా నివాసాలు ఏర్పరుచుకున్నారని తెలిపారు. ప్రభుత్వం వాటిని తొలగించి తమ స్థలాన్ని తమకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ న్యాయ పోరాటాన్ని గుర్తించి, తమ సమస్యను వినేందుకు సమయం కేటాయించాలని కేఎస్ఆర్ మూర్తి కోరారు. సమావేశంలో సొసైటీ ప్రెసిడెంట్ బాలప్రసాద్, కో కన్వీనర్ ఉదయ్ చంద్, కోశాధికారి ఈసీ మల్లికార్జున శెట్టి పాల్గొన్నారు.



ఐఎస్‌సదన్ పార్కులో సమావేశమైన సొసైటీ సభ్యులు

నిఘా నిల్... తాగుబోతులు ఫుల్!

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా చెరువులు
- మందుబాబుల తిష్ట
- చెరువు మధ్యలో బర్త్‌డే పార్టీలు
- పగిలిన మద్యం బాటిళ్లతో వాకర్స్‌కు ఇబ్బందులు
- కొరవడిన పోలీసుల నిఘా

మన్సూరాబాద్: చెరువులను సుందరీకరిస్తాం.. వాకర్స్‌కు సౌకర్యాలు కల్పిస్తున్నాం.. అంటూ ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రకటనలు నీటిమీద రాతలవుతున్నాయి. మన్సూరాబాద్‌లోని చిన్నచెరువు, పెద్దచెరువు ప్రాంతాలు అసాంఘిక కార్యకలపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. చెరువుల కట్టలు మద్యం, గంజాయి సేవించేవారికి, పేకాట రాయుళ్లకు నిలయాలవుతున్నాయి. ఎక్కడెక్కడి నుంచో వస్తున్న యువకులు రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు బర్త్‌డే పార్టీల పేరుతో మత్తులో మునిగి తేలుతున్నారు. చెరువుల చుట్టూ సరైన ఫెన్సింగ్ లేకపోవడం, పోలీసుల నిఘా కొరవడం మందుబాబులకు వరంగా మారింది.

- చెరువుల సుందరీకరణ పనులు సంవత్సరాల తరబడి నత్తనడకన జరుగుతుండటంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి చెత్తను తీసుకువచ్చి పెద్దచెరువులోకి వదిలి వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. ప్రజాప్రతినిధులు, పోలీసులు కల్పించుకుని చెరువుల సుందరీకరణ పనులు వేగంగా చేపట్టి, అసాంఘిక కార్యకలపాలకు అడ్డుకట్ట వేయాలని వాకర్స్, స్థానికులు కోరుతున్నారు.
- పెద్దచెరువు ప్రాంగణంలోని చింతచెట్ల వద్ద ఇరిగేషన్ అధికారులకు నెలవారీ మామూళ్లు ఇస్తూ అనధికారికంగా బర్రెల దొడ్డిని ఏర్పాటు చేశారు.
- మన్సూరాబాద్ చిన్నచెరువులో నీరు లేకపోవడంతో చెరువు మధ్యలోని బడ్డరాళ్లపై, పెద్ద చెరువు ప్రాంతంలోని నిమజ్జనకొలను సమీపంలోని చింత చెట్ల మధ్య బర్త్‌డే పార్టీలు జోరుగా సాగుతున్నాయి.
- చెరువు కట్టలపైకి చీకటి పడగానే మందుబాబులు చేరుకుంటున్నారు. తెల్లవారుజాము వరకుతాగుతూ రచ్చ రచ్చ చేస్తున్నారు. మద్యం బాటిళ్లను పగులగొట్టి వాకింగ్‌ట్రాక్‌పై పడేస్తున్నారు. దీంతో ఉదయం వేళల్లో వాకింగ్‌కు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు.
- మన్సూరాబాద్ పెద్దచెరువు, చిన్నచెరువు కట్టలపై యువకులు యథేచ్ఛగా మద్యం, గంజాయి తాగుతూ మత్తులో మునిగిపోతున్నారు.
- చెరువుల సమీపంలో మద్యం బెల్టు షాపులు ఉండటంతో మందుబాబులు తెల్లవారుజాము వరకు మద్యం సేవిస్తూ చిందేస్తున్నారు.
- చిన్నచెరువు వాకింగ్ ట్రాక్‌పై తాగుబోతులు తిష్ట వేయడంతో వాకింగ్‌కు వచ్చేవారు జంకుతున్నారు.
- చిన్నచెరువులో కొందరు యథేచ్ఛగా భవన శిథిలాలను వేస్తున్న అధికారులు పట్టించుకోవటం లేదు.



మన్సూరాబాద్ పెద్దచెరువు వాకింగ్‌ట్రాక్ వద్ద పడి ఉన్న ఖాళీ మద్యం సీసాలు



మన్సూరాబాద్ చిన్నచెరువులో డంప్ చేసిన భవన శిథిలాల వ్యర్థాలు



మన్సూరాబాద్ పెద్దచెరువులోని చెత్తాచెదారం

పగిలిన మద్యం బాటిళ్లతో ఇబ్బందులు



రాత్రి వేళల్లో పార్టీలు చేసుకుంటున్న యువకులు మద్యం బాటిళ్లను చెరువు కట్టపై పగలగొడుతున్నారు. మార్నింగ్ వాకింగ్ చేస్తున్న వారికి సీసా పెంకులు గుచ్చుకుని గాయాలవుతున్నాయి. చెరువు సుందరీకరణ పనులు నత్తనడకగా సాగడంతో వాకర్స్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాకింగ్ ట్రాక్‌పై వెంటనే లైటింగ్ ఏర్పాటు చేయాలి.

– చిల్కూరి మాధవి, మన్సూరాబాద్, వాకర్

మత్తులో దాడులు చేస్తున్నారు



ఎక్కడి నుంచో వస్తున్న యువకులు రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మద్యం, గంజాయి సేవిస్తూ చిందులేస్తున్నారు. ఇదేమని అడిగిన వారిపై కొందరు మత్తులో దాడులకు పాల్పడుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్‌ను మరింత పెంచాలి. చెరువుల సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తిచేసి వాచ్‌మెన్‌ను కాపాలా పెట్టాలి.

– ఎంజాల జగన్, మన్సూరాబాద్, వాకర్

నిఘా పెంచుతాం



పెద్దచెరువులోని పరిసర ప్రాంతాల్లో చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. యువకులు వ్యసనాలను దూరంగా ఉండాలి. వారు తమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని నడుచుకోవాలి. పెద్దచెరువు ప్రాంతంలో పెట్రోలింగ్ పెంచి ఆకస్మిక తనిఖీలు చేపడతాం.

–రవికుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వనస్థలిపురం

ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

నాగోలు: సావిత్రి బాయి ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో నిరుద్యోగ యువతీ, యువకులకు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, డిజిటల్ మార్కెటింగ్, హార్డ్‌వేర్ నెట్‌వర్క్‌లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ, ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామని ప్రాజెక్ట్ మేనేజర్ ఆదినారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం కోర్సుల్లో ప్రావీణ్యత కనబర్చిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు లోపు ఎస్సీ నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. మార్చి 1 వరకు దరఖాస్తులు అందజేయాలన్నారు. సరూర్‌నగర్ నుంచి సైదాబాద్‌కు వెళ్లే జయనగర్ కాలనీలో ఉన్న కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 8341052153 లో సంప్రందించాలన్నారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

వనస్థలిపురం: విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో ఉన్న మేధాసంపత్తిని, సృజనాత్మకతను వెలికితీస్తాయని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.నిశాంత్‌జైన్ అన్నారు. శనివారం వనస్థలిపురంలోని రవీంద్ర భారతి పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్-3, కరోనా వారియర్స్, హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్లాంట్, డయాలసిస్, గుండె పని విధానం తదితర అంశాల నమూనాలను పరిశీలించి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఇందిరా అవార్డు గ్రహీత, ఫిజిక్స్ ప్రొఫెసర్ సీపీ వర్ధని, పాఠశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, డీన్ శ్రీదేవి, డీఐ దయాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్ట్, క్రాఫ్ట్ పోస్టులు భర్తీ చేయాలని వినతి



మంత్రి జూపల్లిని కలిసిన ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ అన్ ఎంప్లాయిడ్ అసోసియేషన్ ప్రతినిధులు

వనస్థలిపురం: రాష్ట్రంలో నిర్వహించే మెగా డీఎస్సీ/టీఆర్‌టీలో ఖాళీగా ఉన్న ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ల పోస్టులను కూడా భర్తీ చేయాలని తెలంగాణ ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ అన్ ఎంప్లాయిడ్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు ఆ సంఘం ప్రతినిధులు శనివారం రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, టూరిజం అండ్ కల్చర్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులు, బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు రాష్ట్రంలో దాదాపు లక్షకు పైగా ఉన్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి లేక వీరంతా రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మెగా డీఎస్సీలో డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులను కూడా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కర్నె రాజన్‌చంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్లు అశోక్‌కుమార్, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చలో వరంగల్ విజయవంతం చేయండి: ఏఐవైఎఫ్

సైదాబాద్: ఏఐవైఎఫ్ రాష్ట్ర సదస్సు సందర్భంగా నిర్వహిస్తున్న చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్ కోరారు. శనివారం ఆయన ఏఐవైఎఫ్ ప్రతినిధులతో కలిసి ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపాలంటే మోదీ హటావో దేశ్‌కి బచావో నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈనెల 28న వరంగల్‌లోని ఎల్‌బీ కళాశాలలో నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఏఐవైఎఫ్ ప్రతినిధులు చిట్టీ, హసీనా, రేష్మ, అఫ్రీన్, విజయ్, చోటు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా వసతులు కల్పిస్తాం



అగ్రికల్చర్ కాలనీలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న విద్యుత్ హైమాస్ట్ లైట్ల పనులను కార్పొరేటర్ శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజాతానాయక్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో ప్రజలు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని. జీహెచ్ఎంసీ నుంచి ఎక్కువ నిధులు తెచ్చి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, సుబ్బారావు, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మలక్‌పేట: మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని రాజరాజేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ జూకంటి యాదగిరి అన్నారు. మూసారంబాగ్‌లోని ఆలయంలో శనివారం సత్యనారాయణ స్వామి వ్రతం, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. శ్రీలలిత లోకేశ్వరీ లారీ సర్వీస్ మేనేజింగ్ డైరెక్టర్ చక్రవర్తుల గోపీకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ, నిత్య పూజలు, హోమాలు, ప్రత్యేక అర్చనలు కొనసాగుతున్నాయన్నారు. పూజల్లో కమిటీ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రావు, కోశాధికారి విష్ణువర్ధన్‌యాదవ్, సహాయ కోశాధికారి జంగయ్యగౌడ్, ఉపాధ్యక్షులు నర్సింహ, జంగారెడ్డి, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



పాల్గొన్న సైంటిస్ట్ డాక్టర్ కరుణానిధి, కాలేజీ సెక్రటరీ శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు

మలక్‌పేట: ఆధునిక విద్యలో సాంకేతిక పరిజ్ఞానం ఆవశ్యకత పెరిగిందని డీఆర్‌డీఓ సైంటిస్ట్ డాక్టర్ కరుణానిధి సుబ్రహ్మణ్యం అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ అనిబీసెంట్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో శనివారం నిర్వహించిన నేషనల్ సైన్స్ వీక్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'ఆధ్యాత్మిక విలువలతో కూడిన వైజ్ఞానిక విద్య దాని అవశ్యకత' అనే శీర్షికపై ఆయన ప్రసగించారు. వైజ్ఞానిక విద్య, ఆధ్యాత్మికత విలువలు, వ్యక్తిత్వ విలువలు పెంపొందించుకోవాలన్నారు. సనాతన భారతీయ మూల శాస్త్రాలతో పొందుపర్చిన అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాజవల్లి, ఏఓ రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు చేపట్టాలి: బీజేపీ

మన్సూరాబాద్: భూకబ్జాలను ప్రోత్సహిస్తున్న సరూర్‌నగర్ మండల తహసీల్దార్‌పై చర్యలు చేపట్టాలని బీజేపీ మన్సూరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మునగాల హరీష్‌రెడ్డి, నేతలు పాతూరి శ్రీధర్‌గౌడ్, ఎంజాల జగన్, మెరుగు మల్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. మన్సూరాబాద్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. మన్సూరాబాద్ గ్రామ సర్వే నెంబర్-5లో ఓ మహిళా 600 గజాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి ఇల్లు నిర్మిస్తోందని పలుమార్లు ఫిర్యాదు చేసినా తహసీల్దార్ పట్టించుకోలేదన్నారు. ఈ విషయమై రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశాల మేరకు ఆర్డీఓ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ స్థలం ప్రభుత్వ స్థలమని, నిర్మాణం నిలిపివేయాలని ఆదేశించారన్నారు. అయితే, నిర్మాణదారు నిర్మాణాన్ని కొనసాగిస్తూనే ఉన్నారని అన్నారు. ఇప్పటికైన రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ధర్మాధికారి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో శనివారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.పూజల్లో ఆర్‌కే పురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి, హరి హర శర్మ, శివ, శ్రీధర్, ఆనంద్, సంతోష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

'భక్తుల చెంతకే బంగారం' బుకింగ్‌కు ఆఖరిరోజు నేడు

మన్సూరాబాద్: రాష్ట్రంలోని ఆర్టీసీ కార్గో (లాజిస్టిక్స్) కేంద్రాలలో సమ్మక్క-సారలమ్మ ప్రసాదం బుకింగ్స్‌కు ఆదివారం (నేడు) ఆఖరి రోజు అని ఆటోనగర్ ఆర్టీసీ కార్గో కేంద్రం నిర్వాహకుడు పారంద సాయి ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మక్క- సారలమ్మ ప్రసాదాన్ని రాష్ట్రంలోని భక్తులకు చేరవేయాలనే లక్ష్యంతో ఆర్టీసీ కార్గో సేవలు అందిస్తోందన్నారు. కేవలం రూ.300లకే అమ్మవార్ల ప్రసాదం బంగారం(బెల్లం) కుంకుమ, పసుపు అందజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 8686749676ను సంప్రదించాలని కోరారు.

దివ్యాంగురాలి పెళ్లికి ఉప్పల ఫౌండేషన్ సాయం

నాగోలు: నిరుపేదలకు ఉప్పల ఫౌండేషన్ నిరంతరం అండంగా ఉంటుందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సంగారెడ్డి చెందిన నిరుపేద దివ్యాంగురాలు ప్రవల్లిక వివాహం ఉండటంతో శనివారం ఆమె నాగోలులో ఆయనను కలిశారు. ఆమెకు ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఉప్పల స్వప్నల చేతుల మీదుగా మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులు విరాళంగా అందజేశారు. తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ కుమార్, అమ్మ ఫౌండేషన్ అధినేత నాగమళ్ల అనిల్‌కుమార్, అరుణ, మెరుగు శివ కృష్ణ, తుల్జమ్మ, చంద్రావతి పాల్గొన్నారు.

సత్కారం



మన్సూరాబాద్: జనగామ జిల్లాకు చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ పురస్కారం రావటం హర్షనీయమని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ రచయిత డాక్టర్ పెండెం కృష్ణ కుమార్ అన్నారు. శనివారం ఆయన అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

అందరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



ఉచిత వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: అందరూ తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. శనివారం కమర్షియల్ ట్యాక్స్ కాలనీలో మల్లారెడ్డి సేవా ట్రస్ట్ సహకారంతో సన్ షైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్ పవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు పలువురికి కిడ్నీ, గుండె, షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ చరణ్ గౌడ్, రమేష్, నాయకులు అశ్విన్ సింగ్, వెంకట్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.